విశాలాంధ్ర గుంటూరు జిల్లా

సమస్యలను పరిష్కరించండి

– సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : ప్రత్తిపాడు నియోజకవర్గంలో నెల కొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కోరారు. ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులును శుక్రవారం సీపీఐ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంత రావు, ఆకిటి అరుణ్ కుమార్, పుప్పాల సత్యనారాయణ, నాయకులు రావుల అంజిబాబు, ఎన్.దేవా నాయక్, జంగాల చైతన్య, నూతలపాటి చిన్న, బోయినపల్లి వెంకటరావు తదితరులు ఉన్నారు.

డ్రైవర్లు బాధ్యతగా డ్రైవింగ్ చేయాలి

– గుంటూరు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ షేక్.కరీం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : లారీ, బస్సు డ్రైవర్లు బాధ్యతతో.. సురక్షితంగా వాహనాలను నడపాలని గుంటూరు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ షేక్.కరీం సూచించారు. గుంటూరు పట్టణంలోని ప్రైవేట్ హెవీ డ్రైవింగ్ స్కూల్ నందు శిక్షణ పొందుతున్న డ్రైవర్లకు డీటీసీ కార్యాలయంలోని 'సేఫ్టీ డ్రైవింగ్ సెంటర్' నందు అవగాహన కార్యక్ర మాన్ని శుక్రవారం నిర్వహించారు. డీటీసీ షేక్.కరీం లారీ, బస్సు డ్రైవర్లకు బాధ్యతలను, రహదారి భద్రతా నిబంధనలను తెలియజేశారు. షేక్.కరీం మాట్లాడుతూ లారీ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడపరాదని, సరైన జీవిత విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఓవర్ లోడింగ్ చేయరాదని, మితిమీరిన వేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. స్కూల్ బస్సు డ్రైవర్లు విద్యార్థులను సురక్షిత ంగా స్కూల్ నుంచి వారి గమ్యస్థానాలకు చేర్చాలని, విద్యా సంస్థల బస్సులకు విధించిన నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. 60 మంది డ్రైవర్లు ఈ కార్యక్రమానికి హాజరైయ్యారు. ఏఎంవీఐ ఉషా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

193వ రోజుకు చేరిన అన్న క్యాంటీన్ సేవలు

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాలలోని రైలుపేటలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ శుక్రవారం 193వ రోజుకు చేరుకుంది. హైదరాబాద్‌కు చెందిన ముప్పన సూర్యకుమారి సహకారంతో ముప్పన వీర్రాజు, మాణిక్యం జ్ఞాపకార్థం క్యాంటీన్ వద్ద ప్రత్యేక పదార్థాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు వందలాదిగా నిరుపేదలు హాజరై తమ ఆకలిని తీర్చుకుంటున్నారు. ప్రత్యేక పదార్థాలు బ్రెడ్ హల్వా, గారే, బిర్యానితో పాటుగా పెరుగు అన్నాన్ని పంపిణీ చేశారు. పార్టీ నాయకులు నూకతోటి రవి, ఏమినేని కోటేశ్వరరావు, నక్క చిరంజీవి, పర్వతనేని హర్షవర్ధన్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలు తనిఖీ

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన డిగ్రీ 5, 6 సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల కేంద్రాలను కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్‌వీ కృష్ణారావు తనిఖీ చేశారు. ఉమ్మడి గుం టూరు, ప్రకాశం జిల్లాలో ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. కేంద్రాలలో పరీక్షలు రాసే విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఆవులను రోడ్లపైకి రానివ్వకండి

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై ఆవుల సంచారం అధికంగా ఉందని, ఇకపై రోడ్ల మీదకు వస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ కమిషనర్ ఆలిం భాష శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్ల మీదకు రావడం వలన వాహనదారులకు, పాదచారులకు ఇబ్బం దులు కలుగుతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని వివరిం చారు. అనేక పర్యాయములు ఆవుల యజమానులకు సమావేశాలు జరిపి తెలియజేసినప్పటికీ వారిలో మార్పు రావడంలేదని అన్నారు. గోశాలకు తరలిస్తామన్నారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కులాల మధ్య చిచ్చుపెడుతున్న కేంద్ర ప్రభుత్వం

విశాలాంధ్ర-మంగళగిరి : ఎస్సీ వర్గీకరణపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలకు అధికా రం ఉందని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గుర్రం రామారావు శుక్రవారం మంగళగిరి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని బీజేపీ ప్రభుత్వం కేవలం రాజకీయం కోసమే కుట్ర పూరితమైన అంశానికి తెరలేపారని ఆరోపించారు. ఈ తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేక మని, ఇది కేవలం కులాల మధ్య చిచ్చు పెట్టడానికి మాత్రమే బీజేపీ ఉపయోగించిన ఒక అస్త్రం అని, దీన్ని అడ్డుపెట్టుకొని బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే దిశగా కూడా ప్రయాణం చేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తిగా ఆపే విధంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈటె హనోక్, పాల్గొన్నారు.

పెరుగుతున్న నిరుద్యోగాన్ని అరికట్టాలి

- కేంద్ర బడ్జెట్ సంపన్నుల బడ్జెట్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-మంగళగిరి : దేశంలో పెరుగుతున్న నిరుద్యోగాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రత్యక్ష నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాత్రి మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని సీపీఐ శాఖ సమావేశాన్ని పంతగాని మరియదాసు ఇంటి వద్ద నిర్వహించారు. సమావేశానికి గజవల్లి వెంకటకృష్ణారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, గుంటూరు నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, మంగళగిరి నియోజక వర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సంపన్నుల బడ్జెట్‌లా ఉందని, పేద రైతు, కార్మికులకు ఉపయోగపడని బడ్జెట్ అని విమర్శించారు. అమరావతి రాజధానికి ప్రత్యేక నిధులు, ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలని, యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు ఏడాదికి ఇస్తామని చెప్పి మోసపు హామీలతో అధికారం లోకి వచ్చిన మోదీ ప్రభుత్వానికి, రానున్న రోజులలో సీపీఐ ప్రత్యామ్నాయ పార్టీగా బలపడ నున్నదని తెలిపారు. దేశంలో మోదీ నాయకత్వంలోని బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద చర్యలను, కార్పొరేట్ శక్తులకు సంపద కట్టపెట్టే విధానాలను గత ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించడం వల్ల ఇండియా కూటమి పార్లమెంట్‌లో తమ బలాన్ని పుంజుకొని ప్రతిపక్ష పాత్ర బలంగా పోషిస్తుందని జంగాల అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే ప్రజల పట్ల వారి సమస్యల పట్ల సీపీఐ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుంద న్నారు. పార్టీ నిర్మాణాన్ని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయా లన్నారు. ఏడాది డిసెంబర్ 26వ తేదీ నాటికి సీపీఐకి 100 సంవత్సరాలు పూర్తవుతాయని ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో శత వసంతాలు ఉత్సవాలు జరపాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, పంతగాని మరియదాసు, ఎర్రగుంట లక్ష్మణరావు, కొండలు, జాలాది విజయేందర్ రావు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు జాలాది నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

– ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన సీపీఐ, ఏఐటీయూసీ శ్రేణులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం జీఓ 17ను రద్దు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ(బుజ్జి) కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్‌ను శుక్రవారం కలిసిన సీపీఐ, భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత భవన నిర్మాణ రంగం కోసం ఇసుక ఉచితంగా ఇవ్వటం వలన భవన నిర్మాణ కార్మిక రంగంలో పనిచేస్తున్న 32 రకాల పనివార్లకు చేతినిండా పనులు ఉంటాయని, తద్వారా ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయే అవకాశం ఉందని ఆనందం వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లైములకు నిధులు మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంత రావు, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, సీపీఐ నగర నాయకులు నూతలపాటి చిన్న, ఎన్.దేవా నాయక్ తదితరులు ఉన్నారు.

జాతీయ జెండా రూప శిల్పి పింగళి వెంకయ్య

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దేశమాత కోసం తన సర్వస్వం త్యాగం చేసిన మహా మనిషి పింగళి వెంకయ్య అని సీనియర్ ఇంజనీర్ ఘన శ్యామాచార్యులు అన్నారు. జాతీయ పతాక రూప కల్పన చేసిన శ్రీపింగళి వెంకయ్య ఆంధ్రులు కావటం తెలుగు వారందరికీ గర్వకారణ మని కొనియాడారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో జాతీయ జెండా రూప శిల్పి పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అ అనంతరం ఘనశ్యామా చార్యులు మాట్లాడుతూ త్రివర్ణ పతాక రూపకర్తగా ఆంధ్రప్రదేశ్ వాసి పింగళి వెంకయ్య జాతి జనుల గుండెల్లో నిలిచిపోయారన్నారు. 1921లో పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కీలక పాత్ర పోషించిందని అన్నారు. విద్యావేత్త రామచంద్రరావు మాట్లాడుతూ పింగళి వెంకయ్య స్వాతంత్ర్యోద్యమంగా చురుకుగా పాల్గొనేవారని, గాంధీజీ పింగళి వెంకయ్యను బాగా అభిమానించే వారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుతో టీడీపీ సంబరాలు

విశాలాంధ్ర-మంగళగిరి : ఎస్సీ వర్గీకరణ అంశంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని గుంటూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో దళిత నాయకులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంద కృష్ణమాదిగ, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ నాయకులు ఈపూరి పెద్దబ్బాయి, పి.ప్రేమ్ కుమార్, కొదమల సురేష్, మల్లవరపు వెంకట్, ఎర్రగుంట్ల భాగ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా విద్యార్థులు అడుగులు వేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విద్యార్థులు తమ జీవితంలో లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా అడుగులు వేయాలని ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, స్టెప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గోరంట్లలో ఉన్న 'విజేత స్కూల్' నందు 'శ్రమ నీ ఆయుధం అయితే-విజయం నీ బానిస అవుతుంది' అనే అంశంపై విద్యార్థినీ, విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ చదువు విషయంలో విద్యార్థినీ, విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలను ఎంచుకొని వాటిని చేదించే దిశగా ముమ్మరంగా సాధన చేయాలని అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టెప్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణయ్య, విజేత స్కూలు డైరెక్టర్ సురేష్, మానవతా కార్యదర్శి కె.సతీష్, కోశాధికారి టీవీ సాయిరాం, మెడికల్ క్యాంపు చైర్మన్ ధనుంజయ రెడ్డి, ఆత్మకూరి ధర్మారెడ్డి, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

జీఎంసీ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ (ఎఫ్‌ఏసీ) ఎస్.హరికృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ ఎంహెచ్‌ఓ మధుసూదన్, మేనేజర్ ప్రసాద్‌లతో కలిసి జీఎంసీ ప్రధాన కార్యాల యాన్ని పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచాలని, వినియోగంలో లేని బీరువాలు, ఇతర సామగ్రిని తొలగించాలన్నారు. కార్యాలయ పరిసరాల్లో పచ్చదనం పెంపుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఏడిహెచ్‌ని ఆదేశించారు.

తల్లిపాల సంస్కృతిని కొనసాగిద్దాం

విశాలాంధ్ర- తెనాలి : నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు దోహదపడతాయని అదే సంస్కృతిని సమాజంలో కొనసాగనివ్వాలని తెనాలి సిడిపిఒ సునీత అన్నారు. తెనాలి మండలం కఠెవరం గ్రామంలో శుక్రవారం జరిగిన ప్రపంచ తలి పాల వారోత్సవాలలో ఆమె మాట్లాడారు. సహజ సిద్ధంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని తల్లిపాలల్లో వివిధ రకాల పోషకాలుంటాయని వాటితో శిశువు పెరుగుదలకు ఉపకరిస్తాయన్నారు. తల్లి పాలు ముఖ్యంగా రోగనిరోధక శక్తి పెరుగుతుందని, అనారోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే తల్లి బిడ్డకు పాలుఇవ్వాలని హితవు పలికారు. పాశ్చాత్య దేశాల్లో బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంతో పరోక్షంగా తల్లి శరీర సౌందర్యం దెబ్బతింటుందన్న అపోహలు వీడి సహజ సిద్ధంగా ఉత్పత్తి ఆయ్యే తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తుందన్నారు. సిడిపిఒ కార్యకర్తలు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కార్మికులపై కక్ష సాధింపులు మానుకోవాలి

– సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో స్కీం వర్కర్లు, కార్మికులపై టీడీపీ నాయకుల కక్ష సాధింపులు మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ హితవు పలికారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. కొల్లి రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చినటువంటి సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామ, వార్డు సీపీఐ శాఖ సమావేశాలు నిర్వహించుకోవాలని, పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్క కార్యవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ(బుజ్జి) మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి సీపీఐ సభ్యులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ గ్రామ కార్యదర్శులు వారి వారి గ్రామాలలో పారిశుద్ధ్య సమస్యలు, గ్రామ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. పి.డేవిడ్ రాజు, రెంటాల కుమారి, షేక్ గౌస్, వి.సీతారామయ్య, కూసం నాగిరెడ్డి, బి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో భవనాలను పరిశీలించిన ఐఐటీ నిపుణుల బృందం

విశాలాంధ్ర-తుళ్లూరు : రాజధాని అమరావతిలోని భవనాలను హైదరాబాద్ ఐఐటీ నిపుణుల బృందం శుక్రవారం పరిశీలించింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్, ఐపీఎస్ భవన సముదాయాల ప్రస్తుత స్థితిగతులు, వాటి సామర్థ్యం, పటిష్టత గురించి పరిశీలన జరిపారు. ఐఐటీ ప్రొఫెసర్లు సుబ్రహ్మణ్యం, మున్వర్ భాషా మాట్లాడుతూ భవనాలు ఇతర నిర్మాణాలకు సంబంధించిన సాంకేతికపరమైన అంశాలను పూర్తిగా పరిశీలించాక ప్రభుత్వం, సీఆర్‌డీఏ అధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు. నివేదిక అందించేందుకు నిర్దిష్టమైన గడువులేదన్నారు. రాజధానిలో 2019కు ముందు నిర్మాణాలు ప్రారంభమై మధ్యలోనే నిలిచిపోయిన భవనాలు కొన్ని ఉండగా, మరికొన్ని ఫౌండేషన్ పనులు పూర్తి చేసుకుని అసంపూర్తిగా మిగిలిపోయాయి. కూటమి అధికారంలోకి రావడం, అమరావతి నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వడంతో ఈ భవనాల ఫౌండేషన్ సామర్థ్యాన్ని పరిశీలించే బాధ్యతను ఐఐటీ మద్రాస్, హైదరాబాద్ నిపుణుల బృందంకు అప్పగించింది. మద్రాస్ ఐఐటీబృందం కూడా భవనాలను, ఇతర నిర్మాణాలను పరిశీలించనుంది.

తెనాలిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం



విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పట్టణంలో చినరావూరుతోట, పోతురాజు కాలనీలలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. సచివాలయ ఆరోగ్యసిబ్బంది మున్సిపల్ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ నీటి నిల్వల వలన దోమలు తమ సంతతిని పెంచుకొని తద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గునియా, బోధకాలు, మెదడువాపు, జికా వైరస్ తదితర వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయన్నారు. ప్రజలు అవగాహన కల్పించుకొని వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వాడుక నీటిపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. చినరావూరు తోట సచివాలయం పరిధిలో వీధు లలో ర్యాలీ నిర్వహిస్తూ కరపత్రా లను పంచుతూ నినాదాలు చేశారు. కార్యక్ర మంలో వార్డు కౌన్సిలర్ దివి అనిత, తెనాలి పట్టణ ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, దీపాల శ్రీనివాసరావు, బందారు మల్లేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖలు ప్రణాళికతో కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట ప్రణాళికతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజలతో కలసి జిల్లా అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో అతిథులు, ఆహ్వాని తులకు, విద్యార్థులకు, ప్రజలకు వేర్వేరుగా సీటింగ్ ఏర్పాట్లు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ప్రశంసా పత్రాలు అందించటం, ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు జారీ చేసారు. విధుల్లో అత్యంత ప్రతిభ కనపరుస్తున్న ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాలకు సంబంధించి పేర్లను 8వ తేది లోపు కలెక్టరేట్‌కు సమర్పించాలన్నారు. అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలపై స్టాళ్ళను, శకటాలను ఏర్పాటు చేయాలన్నారు. మంత్రి ప్రసంగ పాఠాన్ని తయారు చేసేందుకు సంబంధిత జిల్లా అధికారులు తమ శాఖలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై క్లుప్తంగా వివరాలను జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారికి 8వతేది లోపు అందించాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, ఆర్డీఓ శ్రీఖర్, డీటీసీ షేక్ కరీం, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ లక్ష్మీ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి కోమలి పద్మ, సమగ్రశిక్ష ఏపీడీ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన ముదిగొండ ప్రకాష్

విశాలాంధ్ర-తాడేపల్లి : మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి కార్యాలయంలో శుక్రవారం వైసీపీ తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను జగన్ దృష్టికి తీసుకువెళ్లారు.

గల్లా మాధవి నిర్ణయం యువతకు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గాంధీజి కలలు కన్న స్వచ్ఛ రాజకీయాల స్ఫూర్తితో తన నెలవారి జీతాన్ని ప్రజలకు అంకితం చేసిన గుంటూరు పశ్చిమ శాసనసభ్యురాలు గల్లా మాధవి నిర్ణయం యువతకు స్ఫూర్తిదాయకం అని గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ కొనియాడారు. గల్లా మాధవి తొలిపరిచయంతోనే తనదైన శైలిలో పరిపాలనతో నమ్మి ఓట్లేసిన ప్రజలకు అండగా ఉంటూ గుంటూరు అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని తలంపుతో కష్టపడుతున్న తీరు అభినందనీయమని అలాగే ప్రభుత్వం శాసనసభ్యురాలిగా తనకిచ్చిన నెలవారీ జీతంలో రూ. 1.50 లక్షలు ప్రజలకు సామాజిక సేవ కార్యక్రమాలకు ఇస్తామని ప్రకటించటంతో నేటి యువతరానికి గల్లా మాధవి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు.

స్టాఫ్ నర్సులను పదోన్నతి కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అర్హత కలిగిన స్టాఫ్ నర్సులను హెడ్ నర్సులుగా పదోన్నతి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ) గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా గుంటూరు ప్రాంతీయ సంచాలకులు(మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్)డాక్టర్ కె. సుచిత్రను కోరారు. అలాగే గ్రేడ్-3 ఏఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా పదోన్నతి కల్పించా లని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గుంటూరు ప్రాంతీయ సంచాలకులు (మెడికల్ అండ్ హెల్త్‌సర్వీసెస్)గా నూతనంగా విధుల్లోకి చేరిన డాక్టర్ కె.సుచిత్రను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన డాక్టర్ సుచిత్ర ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని తప్పని సరిగా పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రహిమాన్, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వర రావు, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, పెద రత్తయ్య, ఆదిలక్ష్మి, సరళ పాల్గొన్నారు.

దారాను పరామర్శించిన జంగాల

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని సీపీఐ సీనియర్ నాయకులు దారా గురునాథంను శుక్రవారం వారి నివాస గృహంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పరామర్శించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఎన్నారై హాస్పటల్లో చికిత్స తీసుకుంటూ వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న గురునాథమును పరామర్శించారు.ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరపతయ్య, గుంటూరు నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, గజవల్లి వెంకటకృష్ణ, జాలాది విజయేందర్ రావు తదితరులు ఉన్నారు.

సమస్యను తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఏపీ హంస అసోసియేషన్ గుంటూరు జిల్లా, గుంటూరు సిటీ యూనిట్ ఆధ్వర్యంలో యూనియన్ కార్యవర్గం నూతనంగా గుంటూరు ప్రాంతీయ సంచాలకులు (మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్)గా నియమితులైన డాక్టర్ కె. సుచిత్రను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యవర్గం వారు మాట్లాడుతూ వైద్యశాఖలో పని చేస్తున్న ఉద్యోగుల ప్రమోషన్ అయిన ఎంపీహెచ్ఏ-ఎఫ్ నుంచి ఎంపీహెచ్ఎస్-ఎఫ్‌గా, స్టాఫ్ నర్స్ ట్రైనింగ్ పూర్తి చేసి ఉన్న ఎంపీహెచ్ఏ (ఎఫ్)లకు స్టాఫ్ నర్సులుగా, స్టాఫ్ నర్స్ నుంచి హెచ్ నర్సుగా చాలా కాలంగా చేపట్టలేదని ఆమె దృష్టికి తీసుకెళ్ళారు. జీఓ 143 ప్రకారం సర్దుబాటు చేసిన వారి జీతాల సమస్యలుపై కూడా చొరవ తీసుకుని అందరికీ న్యాయం చేయాలని కోరారు. అనంతరం డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీని కలిసి రెగ్యులర్ అయిన కొంత మంది ఎంపీహెచ్ఏ (ఎం/ఎఫ్)లకు ఇప్పటికీ జీతాల సమస్య ఉందని, తక్షణమే ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఏఎన్ఎం నుంచి 2 సంవత్సరాల జీఎన్ఎం ట్రైనింగ్‌కి వెళ్ళి ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారిని వెంటనే సర్దుబాటు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఓను కోరారు. జీఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసుకుని ఆరోగ్య సమస్యల కారణంగా వారి నియామక సచివాలయాలకే వెళ్ళాలి అనుకునే వారికి వెసులుబాటు కల్పించి వెంటనే రిలీవ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగవర్ధన, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.కిరణ్, జిల్లా కోశాధికారి బి.వెంకటప్పయ్య, సిటీ ప్రెసిడెంట్ నరేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు షరీఫ్ మహమ్మద్, సిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, దౌలా తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, అమరావతి రోడ్డు, మెడికల్ హాస్టల్ ఎదురు, ఎన్.టి.ఆర్. కాలనీ, 1వ లైను, డోరు నెం.4-23-68రు కాపురస్తులు శెట్టిపల్లి ముత్యాలరావు గారి కుమారుడు శెట్టిపల్లి రాజేష్ గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది.

నా క్లయింటు పేరిట గుంటూరు సిటీ, గోరంట్ల డి.నెం.318/ఎ, ప్లాటు నెం.191 నందలి 74-86 చదరపు గజముల స్థలము అందలి డాబా ఇల్లు కలదు. సదరు ఆస్తి నా క్లయింటు పేరిటకు ది.04-04-2024న విక్రయ దస్తావేజు నెం.2625/2024రుగా కొరిటెపాడు యస్.ఆర్.ఓ నందు రిజిస్టరు కాబడినది. కాగా, సదరు దస్తావేజునకు లింకు దస్తావేజు అయిన ద.నెం.8378/2022రు గల ఒరిజినల్‌ను ది.27-07-2024న లాడ్జి సెంటర్ నుండి అరండల్‌పేటకు జిరాక్స్ నిమిత్తము టూ-వీలర్‌పై వెళ్ళుచుండగా పోయినది. సదరు దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల నాకు గాని, నా క్లయింటుకు గాని తెలియజేయగలరు. అలాగే సదరాస్తి విషయమై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురితమైన తేది నుండి 15 రోజులలోగా తెలియజేయగలరు.

ఇట్లు: సయ్యద్ ఆసిఫ్ అలీ, అడ్వకేట్, కోబాల్ట్‌పేట, గుంటూరు. సెల్ నెం. 93941 55522

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన గుంటూరు జిల్లా, మేడికొండూరు(మం), మండపాడు గ్రామ కాపురస్తురాలు నా క్లయింటు సోదరి అయిన తాళ్ళ వెంకటరెడ్డి గారి భార్య అలాబాల గారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు పేరుతో ది:14-03-2000న విక్రయ దస్తావేజు నెం.214/2000రుగా యస్.ఆర్.ఓ.తాడికొండ ద్వారా రిజిష్టరు పొందిన తాడికొండ సబ్.డి.& మండలం, తాడికొండ గ్రామ సర్వే నెం: 464లో యు.11-45సెంట్లు మింజుమలే యు.3-00 సెంట్లు భూమికి చెందిన దస్తావేజు యొక్క ఒరిజినల్ లింకు విక్రయదస్తావేజు నెం.1175/1998 యస్.ఆర్.ఓ.తాడికొండ మరికొన్ని డాక్యుమెంట్లులను నా క్లయింటు తాడికొండ యస్.ఆర్.ఓ.లో వ్యాల్యుయేషన్ కోరకు తీసుకొనివెళ్ళి, రిజిస్ట్రారు వారి ఆఫీసు దగ్గర జిరాక్స్ తీయించుకొని రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్ళి బయటకు వచ్చి చూసుకొనగా సదరు ఒరిజినల్ లింకు విక్రయ దస్తావేజు నెం.1175/1998 కనిపించలేదు. ఆ చుట్టుపక్కల ఎంత వెతికిన దొరకలేదు. కావున సదరు ఒరిజినల్ లింకు దస్తావేజు విక్రయ నెం.1175/1998గల కవరు ఎవరికైనా దొరికినయెడల నా క్లయింటుకు గాని, ఈ క్రింది అడ్రస్ నందు గాని అందజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లు కాక సదరు దస్తావేజును ఉపయోగించి ఏవిధమైన అన్యాక్రాంతములు జరిపిన నా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయుటమైనది.

ప్రత్తిపాటి ప్రభాకర రావు, అడ్వకేటు, "ధన్వంతరి నిలయం" పట్టాభిపురం, గుంటూరు. సెల్:9849084919

నోటీసు

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE(SENIOR DIVISION)::GANNAVARAM
E.P. No: 6 / 2023 in O.S. No: 498 / 2009
Between:
Jonnala Venkata Raghu Rami Reddy ...D.H.R
AND
Jelli Lokeswari ...J.D.R.
To,
Jelli Lokeswari, W/o.Venkateswara Rao, Presently residing at Door No.3-29-58/A, Opp.Chaitanya Godavari Grameena Bank, 3rd lane, Krishna Nagar, Guntur - 522006.

పై నెంబరు ఇ.పి లో జె.డి.ఆర్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని అర్డరు చేయుగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:19-08-2024 న ఉ.గం.10-30ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 19-08-2024

K.A.WILSON, డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్, 3/11. బ్రాడీపేట, గుంటూరు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన గుంటూరు సిటీ, సీతమ్మ కాలనీ, 6/2 కాపురస్తురాలు లేటు యార్లగడ్డ బిక్షాలు గారి భార్య సుబ్బమ్మ గారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునదేమనగా, నా క్లయింటు పేరిటిన ఉన్న, గుంటూరు డి., నల్లపాడు సబ్.డి., జి.యం.సి. ఏరియాలో చేరిన నల్లపాడు గ్రామ డి.నెం.204/ఎ మింజుమలె యు.0-22సెంట్ల భూమిలో చ.గ.110లు ఖాళీ నివేశన స్థలముకు చెందిన ఒరిజినల్ దస్తావేజు నెం:8499/2006, ది: 26-10-2006న యస్.ఆర్.ఓ.నల్లపాడులో రిజిస్టరు కాబడిన దస్తావేజు మరికొన్ని డాక్యుమెంట్లను తీసుకొని ది:23-07-2024న జిల్లా కోర్టువద్ద లాయర్ గారికి చూపించి తిరిగి తన ఇంటికి వెళ్ళు క్రమంలో కోర్టు పరిసర ప్రాంతాలలో పోయినది. ఆ చుట్టు ప్రక్కల ఎంత విచా రించినను దొరికియుండలేదు. కావున సదరు దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల నాకుగాని, నా క్లయింటుకు గాని అందజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లుగాక సదరు దస్తావేజును దుర్వినియోగపరచిన యెడల నా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు భాధ్యులు కాగలరు.

కె.వి. రమణారెడ్డి, 16/4 అరండల్‌పేట, గుంటూరు, సెల్: 8978777019

CHANGE OF SUR NAME

I, **SHAIKH KHADAR BASHA VALI** (Old Name) **S/o. SHAIKH MOULALI**, Resident of D.No.32-596/1, 1st Lane, Subhani Nagar, Chikalakuri pet, Guntur District, PIN – 522616, A.P.. I have changed my name as **SHAIK KHADAR BASHA VALI S/o. SHAIKH MOULALI** here by my name is known as **SHAIK KHADAR BASHA VALI** (New Name) S/o. **SHAIKH MOULALI.**

CHANGE OF NAME

I, **SHAIK BHASHA** (Old Name), S/o. **Shaik Karim Saheb**, Resident of Door No.1-3-111/a, Gujjanagundla 2nd Lane, Guntur, Guntur District - 522006, Andhra Pradesh. I have changed my name as **SHAIK BASHA** (New Name) S/o. **Shaik Karim Saheb**. Hereafter my name is known as **SHAIK BASHA** (New Name) S/o. **Shaik Karim Saheb**.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేది సీపీఐనే

విశాలాంధ్ర-ఈపూరు : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రజా పోరాటాలు చేస్తుంది సీపీఐ యేనని వినుకొండ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న షాదీఖానాలో 5వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని ముప్పాళ్ళ, చిట్టాపురం, వనికుంట, ఈపూరు, అంగలూరు, కొండ్రముట్ల, కొండ్రముట్లపాలెం తదితర గ్రామాలలో శుక్రవారం మండల సీపీఐ నాయకులు ఊట్ల రామారావు, సూరే అప్పారావులతో కలిసి విస్తృత ప్రచారం చేపట్టారు. బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మోదీ నాయకత్వంలోని బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద చర్యలను, కార్పొరేట్ శక్తులకు సంపదను కట్టిపెట్టే విధానాలను గత ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించడం వలన ఇండియా కూటమి పార్లమెంట్‌లో తమబలాన్ని పుంజుకుని ప్రతిపక్ష పాత్ర బలంగా పోషిస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలుచేయాలని కోరారు. ఈ నెల 5న జరిగే సమావేశానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, కేవీవీ ప్రసాద్, పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతీ వరప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. నరసరావుపేటలో జరిగే జనరల్ బాడీ సమావేశానికి తరలి వచ్చి విజయవంతం చేయాలని బూదాల కోరారు. మండల సీపీఐ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ ఏర్పాటుకు సహకరించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : చిలకలూరిపేట పట్టణంలోని ఎన్నార్టీ సెంటర్ వద్ద ఆటో స్టాండ్ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ పట్టణ సీఐ రమేష్‌ను ఏఐటీయూసీ, సీపీఐ, టిడ్కో గృహాల ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు కలిసి మెమోరాండం అందచేశారు. ఆటో కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని స్పందించిన సీఐ స్థలాన్ని పరిశీలించి ఆటో స్టాండ్ ఏర్పాటుకు సహకరిస్తామని తెలియజేయడం జరిగింది. సీఐను కలిసిన వారిలో సీపీఐ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు పేలూరి రామారావు, సీపీఐ నాయకులు బొంతా భగత్ సింగ్, టిడ్కో గృహాల యూనియన్ నాయకులు కృష్ణ, ఆటో డ్రైవర్లు తదితరులున్నారు.

తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-వినుకొండ : తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం వినుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఏ సెక్టార్ నందు విష్ణుకుండి నగర్ అంగనవాడి సెంటర్ నందు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గర్భవతి సత్వర పేరు నమోదు చేయించాలని తల్లిపాలు దేవుడు ఇచ్చిన వరం అని తల్లులకు తెలియజేశారు. సక్రమంగా సకాలంలో ప్రతి బిడ్డను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు చేర్పించాలని, స్పెషల్ ఆఫీసర్‌గా వచ్చిన శ్రీనివాసులు తెలిపారు. అంగన్వాడీ అందజేసే పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. మున్సిపల్ సిబ్బంది వెంకయ్య, శ్రీనివాసరావు, శానిటరీ ఇన్స్పెక్టర్, అంగన్వాడీటీచర్స్, తల్లులు పాల్గొన్నారు.

వైద్యుడి నిర్లక్ష్యంతో.. నిండు ప్రాణం బలి

విశాలాంధ్ర-వినుకొండ: పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల చిన్నపరెడ్డి హాస్పటల్లో వైద్యుని నిర్లక్ష్యంతో ఈపూరు మండలం ఉడిజర్ల తండాకు చెందిన వడితే పద్మభాయి (30)అనే మహిళ మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి వైద్యులు చికిత్స అందించే క్రమంలో నిర్లక్ష్యం చేయడం వల్లనే మృతి చెందింది అంటూ బంధువులు శుక్రవారం రాత్రి ఆందోళ నకు దిగారు. ఉన్నతాధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

అంగన్వాడీకి కుర్చీలు, ఫ్యాన్లు అందజేత

విశాలాంధ్ర-ఈపూరు : యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఈపూరు మండలం కొచ్చర్ల సెక్టార్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. ఈపూరు మండలం కొచ్చర్ల ఉప్పరపాలెం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెనుమల వెంకటేష్ సహకారంతో ఫౌండేషన్ ప్రెసిడెంట్ పమిడిపల్లి అనిల్ ద్వారా సూపర్‌వైజర్ రాజ్యాలక్ష్మికి కుర్చీలు, ఫ్యాన్లు, చాపలు అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మాజీ సర్పంచ్ కూరాకుల శ్రీదేవి, బేతంజర్ల యోగేశ్వరరావు(డీలర్), పమిడిపల్లి ఇశ్రాయేలు, కూరాకుల బుల్లి నాయుడు, తిప్పనబోయిన శరా బండి రాజు, చిందుకూరి నరసంహారావులు ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

చిత్రకారుడు డా.వజ్రగిరి జెస్టిస్‌కు "కుంచె గురు" అవార్డు

విశాలాంధ్ర- వినుకొండ : "భారతీయ నామఫలక కుంచె కళావిరద సంఘ్"వారు భారత జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రకారుల మహాసభలో " జాతీయ కుంచె గురు" అవార్డు ప్రదానం చేశారు. గత నెల 31 న బెంగళూరు "కర్ణాటక చిత్రకళా సంఘ భవనం"లో జరిగిన సభలో కమర్షియల్ చిత్రకారుడిగా, చిత్రకళా ఉపాధ్యాయుడిగా, అనేక జాతీయ అంతర్జాతీయ అవార్డులు అందుకున్న డా,జెస్టిస్ సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. వినుకొండ పట్టణ రాజకీయ ప్రముఖులు, కవులు, కళాకారులు, పాస్టర్‌లు, న్యాయవాదులు, ఉపాధ్యా యులు, వివిధ కళా సంస్థల ప్రతినిధులు, ఆయనను హృదయ పూర్వకంగా అభినందించారు. మరెన్నో అవార్డులు సాధించాలని అభిలాష వ్యక్తం చేశారు.

ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్ర వారం మండల స్పెషల్ ఆఫీసర్ కె.సూర్య ప్రకాష్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశా లలో ఉపాధ్యా యుల పనితీరును పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పాఠశాలలో గల రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టికను, త్రాగునీటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకమును పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోంచేసినారు. ఈ కార్యక్రమంలో ఎండీఓ సిహెచ్ లక్ష్మీకుమారి, ఎంఈఓ-1 హబీలా, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని కంచరగుంట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా నవోదయ నోడల్ ఆఫీసర్, మండల ప్రత్యేకాధికారి కె.సంజీవరావు తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చిన పోషక పదార్థాల నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.లక్ష్మీనారాయణ గుప్తా ఉన్నారు.

నాగార్జునసాగర్ విమానాశ్రయాన్ని కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో-పల్నాడు జిల్లా : పల్నాడు జిల్లాలోని నాగార్జునసాగర్‌లో ఎన్నో ఏళ్ళుగా విమానాశ్రయాన్ని పునఃనిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు ప్రారంభించింది. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఫ్లైటెక్ ఏవియేషన్ అకాడమీ ఫౌండర్ కెప్టెన్ మమతలు సాగర్ డ్యాం ప్రాంతంలోని విమానాశ్రయ భూములను, ఫ్లైటెక్ ఏవియేషన్‌ను పరిశీలించారు. నాగార్జునసాగర్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసేందుకు పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఆసక్తి కనబరుస్తుంది. పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరపు రామ్మోహన్ నాయుడు సాగర్ విమానాశ్రయాన్ని త్వరితగతిన అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించా ల్సిందిగా ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా ప్రాంతాల వారీగా ఎయిర్ కనెక్టవిటీ స్కీమ్‌ను విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం నాగార్జున సాగర్, దొనకొండ విమానాశ్రయాలను గ్రీన్ ఫీల్డ్‌గా తీర్చిదిద్దుతామని గతంలో ప్రకటించింది. నాగార్జునసాగర్‌లో 1960లో నిర్మించబడిన ఈ విమానాశ్రయం 90 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. స్వర్గీయ ముఖ్య మంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 2007లో నాగార్జున సాగర్ విమానాశ్రయాన్ని విమాన శిక్షణ సంస్థకు కేటాయించి ఆ సంస్థ ద్వారా పైలెట్‌లకు నాణ్యమైన శిక్షణ కల్పించేందుకు ప్రయత్నించింది. అయితే సంబంధిత సంస్థ శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించకపోవడంతో నాటి ప్రభుత్వం లీజు రద్దు చేసింది. ప్రస్తుతం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు సాగర్‌లో భూమి లభ్యతపై విచారణ ప్రారంభించారు. ఇప్పటికే ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని భోగాపురం, దగదర్తి, ఓర్వకల్లులోని విమానయాన ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 80 శాతం నిధులను కేటాయించనుండగా రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం నిధులను భరిస్తుంది. నాగార్జునసాగర్‌లోని విమానాశ్రయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం సరవేగంగా ప్రణాళికలు రూపొందిస్తుంది.

సామాన్యుల నడ్డి విరుస్తున్న నిత్యావసర ధరలు: సీపీఐ

విశాలాంధ్ర-శావల్యాపురం : నిత్యావసర సరు కుల ధరలు పెరిగి సామాన్యుల నడ్డి విరుస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్ర వహిస్తున్నాయని సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు విమర్శించారు. ఆగస్టు 5వ తేదీన నరసరావుపేటలో జరిగే విస్తృతస్థాయి సమావేశాలు విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని అన్ని గ్రామాలలో సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జనరల్ బాడీ సమావేశం ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు నరసరావుపేటలోని షాదీఖానాలో జరుగునని, ఈ సమావేశాలకు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయకుమార్, కేవీవీ ప్రసాద్, పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ హాజరవుతారని తెలిపారు. మండలంలోని కార్మిక, కర్షక, రైతు సోదరులందరూ ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం

విశాలాంధ్ర-శావల్యాపురం : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని మాజీ ఎంపీపీ అమృతపూడి కోటయ్య అన్నారు. మండల కేంద్రం శావల్యాపురం ప్రధాన సెంటర్‌లో గల బాబు జగ్జీవన్ రాయ్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీఆర్ మోహన్ చంద్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు వంద తరాల భవిష్యత్‌ను నిర్దేశించబోతుందన్నారు. మందా కృష్ణ మాదిగ పోరాట స్ఫూర్తితో దేశంలోని ఎస్సీ ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రైవేటు రంగంలో కూడా ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్య క్రమంలో యోహన్, ముట్లూరి నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : కార్మికుల శ్రమకు తగిన న్యాయమైన కూలి చెల్లించాలని చిలకలూరిపేట నియోజకవర్గ సీపీఐ ఇన్‌చార్జ్ కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ అన్నారు. గురువారం సాయంత్రం చలివేంద్రం బజార్ ముఠా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సమావేశం పట్టణంలోని గౌడ కళ్యాణ మండపంలో జరిగింది. అన్నిరకాల నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో ముఠా కూలీలకు ఇచ్చే కూలీ కూడా పెంచాల న్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు పేలూరి రామారావు, టౌన్ పార్టీ మాజీ కార్యదర్శి నాయుడు శివకుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయ కులు కాసా సాంబయ్య, సీపీఐ నాయకులు బొంతా భగత్‌సింగ్, ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరరావులు పాల్గొని చలివేంద్రం బజార్ ముఠావర్కర్స్ యూనియన్ సమస్యలపై మాట్లాడటం జరిగింది. యూనియన్ నాయకులు రామారావు, సాయి, 70మంది సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

విశాలాంధ్ర-నరసరావుపేట : జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య 148వ జయంతి సందర్భంగా నరసరావుపేట పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొ న్నారు. మేదరమెట్ల అంజమ్మ మస్తాన్ రావు మహిళా కాలేజీ ఆధ్వర్యంలో శుక్రవారం వంద అడుగుల జాతీయ జెండాతో స్వర్గీయ పింగళి వెంకయ్య జిందాబాద్ అంటూ ర్యాలీ ఏర్పాటు చేశారు. పీఎస్‌సీ కాలేజీ నుంచి గడియార స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. దేశానికి పింగళి వెంకయ్య అందించిన సేవలను కొనియాడారు. బాల్యం నుంచే దేశం కోసం అడు గులు వేసిన పింగళి వెంకయ్య మన ప్రాంతం వారు అని చెప్పు కోవడానికి గర్వపడుతున్నామన్నారు. అంతటి దేశ భక్తి కలిగిన వ్యక్తి జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శేషగిరిరావు, డైరెక్టర్ శ్రావ్య, కపిలవాయి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

551.30 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

విశాలాంధ్ర-మాచర్ల : నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో ఒక్క రోజులో 13 అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు సాగర్ జలాశయ నీటిమట్టం 551.30 అడుగులకు చేరింది. ఇది 212.6510 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 5,292, ఎడమ కాలువకు 778 ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,744, ఎస్‌ఎల్బీసీకి 1,650 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి 20 అడుగుల మేర ఎత్తి 10 క్రస్ట్ గేట్లు ద్వారా 4,66,650 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన అనంతరం మొదటి పవర్ హౌస్ ద్వారా 23,904 క్యూసెక్కులు, రెండవ పవర్ హౌస్ ద్వారా 37,957 క్యూసెక్కులు మొత్తం సాగర్ జలాశయానికి 4,61,797 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. వరదనీరు ఇలాగే కొనసాగితే మరో రెండు, మూడు రోజుల్లో సాగర్ జలాశయ నీటిమట్టం గరిష్ట స్థాయిలో 590 అడుగులకు చేరుకునే అవకాశం ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 883.30 అడుగుల వద్ద ఉండగా ఇది 206.0996 టీఎంసీలకు సమానం. శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల నుంచి 3,21,633, రోజా నుంచి 1,67,728 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దీంతో మొత్తం శ్రీశైలం జలాశయానికి ఇన్ ఫ్లోగా 4,89,361 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఆయకట్టు పరిధిలోని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ అభివృద్ధి లక్ష్యం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : పట్టణంలోని షాధిఖానా, టిడ్కో గృహాలు, పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌లను శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పరిశీలించారు. నిర్మాణానికి సంబందించిన విషయాలను అధికారులు కన్నాకు వివరించారు. మధ్యలో ఆగిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సత్తెనపల్లి పట్టణంలో శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ విస్తృత పర్యటన చేశారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని టిడ్కో గృహాలు, షాదీఖానా, పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌లను పరిశీలించి, పెండింగ్ పనులను ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే పనులను వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయకుండా పక్కన పెట్టేసి, అయిదు సంవత్సరాల కాలం వృధా చేశారని అన్నారు. వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.35 లక్షల వ్యయంతో మౌలిక సదుపాయాలు

విశాలాంధ్ర-అమరావతి : మండల పరిధిలోని మునుగోడు గ్రామంలో రూ.35 లక్షల వ్యయంతో గ్రామ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాలు రూపకల్పనకు స్థానిక శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అభివృద్ధి అంటే తెలుగుదేశం పార్టీ, తెలుగుదేశం పార్టీ అంటేనే ప్రజల పార్టీ అని కొనియాడారు. పార్టీలకతీతంగా ఉమ్మడి కూటమితో గ్రామ స్వరాజ్యాలు నెలకొల్పటమే ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ మేకల హనుమంతరావు, మండల టీడీపీ అధ్యక్షులు మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

భ్రమరా టౌన్ షిప్ పై దుష్ప్రచారం

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ సమీపంలో ఉన్న భ్రమరటౌన్‌షిప్‌లో గత సంవత్స రం నుండి నివసిస్తున్న సొంత ఇంటి గృహస్తులు శుక్రవారం వినుకొండ ఎంపీడీవో ఆఫీస్ నందు వినతి పత్రం అందజేశారు.భ్రమర వెంచర్ నిర్వాహకులపై వ్యక్తిగత కారణాల దృష్ట్యా వెంచర్ బాగోలేదని, మౌలిక వసతులు బాగోలేదని ఇటీవల కాలంలో పత్రికలకు ప్రకటనలు ఇస్తూ దుష్ప్రచారం చేస్తూ ఫేక్ సొసైటీ రిజిస్ట్రేషన్ చూపిస్తూ వెంచర్ యొక్క ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రవర్తిస్తూ ప్రచారాలు చేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకి విన్నవించారు. అలానే భ్రమర వెంచర్ నిర్వాకులు మేము చేరిన నాటి నుండి కంటికి రెప్పలా కాపాడు తున్న వ్యవస్థ భ్రమర అని, ఇటువంటి భ్రమరా టౌన్ షిప్ పై బురద జల్లే ప్రయత్నం మానుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జై శ్రీనివాసరావు, టి సాయి, పవన్ కుమార్, జై సురేంద్ర, ఎం రాజేష్, వి దయానందరావు, ఎం సునీత, జై నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా సురేష్ నాయక్ బాధ్యతలు

విశాలాంధ్ర-వినుకొండ : న్యూ వినుకొండ ఏరియా డైరెక్టర్స్ అండ్ డాన్స్ మాస్టర్ల అసోసియేషన్ సభ్యులు నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన వినుకొండ తహసీల్దార్ సురేష్ నాయక్‌ని శాలువాలతో, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారులకు గుర్తింపు కార్డుల కొరకు ఎమ్మార్వోని చర్చించగా ఆయన సానుకూలంగా స్పందించారు. న్యూ వినుకొండ ఏరియా డైరెక్టర్స్ అండ్ డాన్స్ మాస్టర్ అసోసి యేషన్ అధ్యక్షులు అమృత పూడి సాల్మన్ రాజు, సీనియర్ డైరెక్టర్ పెదకంచెర్ల భవ నాసి వెంకట్రావు, సీనియర్ డైరెక్టర్ నాగులవరం సెక్రటరీ మల్లవరపు కోటేశ్వరరావు, న్యూ వినుకొండ ఏరియా డైరెక్టర్స్& డాన్స్ మాస్టర్ అసోసియేషన్ కళాకారులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

విశాలాంధ్ర-రెంటచింతల : కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వర్గీకరణపై గురువారం సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చారిత్రాత్మకమని ఎంఎస్‌పీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గడిపర్తి శ్రీనివాసరావు అన్నారు. సుప్రీం తీర్పును హర్షిస్తూ శుక్రవారం స్థానిక మెయిన్ రోడ్ సెంటర్లోని ఎమ్మార్పీఎస్ జెండా వద్ద ఎంఎస్పీ నేతలు, కార్యకర్తలు నరేంద్ర మోదీ, చంద్రబాబు, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ఎర్ర వెంకయ్య మాదిగ, టౌన్ అధ్యక్షుడు మరియబాబు మాదిగ, అంబయ్య, కర్ర ముసలయ్య, మరియదాస్, అనిల్ మాదిగ తదితర నేతలు పాల్గొన్నారు.

రూరల్ సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్‌గా రామకృష్ణ బాధ్యతలు

విశాలాంధ్ర-నరసరావుపేట: నరసరావుపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న పసుపులేటి రామకృష్ణ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ నరసరావుపేట రూరల్ పరిధిలో వివాదాస్పద గ్రామాలను గుర్తించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అలాగే గుట్కా గంజాయి వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు. రోడ్లపై బర్త్ సెలబ్రేషన్స్ డిజె సౌండ్స్ లాంటివి కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కామేపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను కామేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణి స్త్రీలను, బాలింతలను తల్లిపాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామేపల్లి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయి పలువురు గర్భిణీ స్త్రీలను ఉద్దేశించి మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలని, పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించటం వలన రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉంటారని వివరించారు. పుట్టిన శిశువులకు ఆరు నెలలు వచ్చేంతవరకు తల్లిపాలు ఇవ్వాలని, ఆరు నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ ఇచ్చే పోషక ఆహారం ప్రతిరోజు క్రమం తప్పకుండా తినడం వలన లోపాలు ఉండవని చెప్పారు. మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి తహశీల్దార్‌గా ప్రసాద్

విశాలాంధ్ర- కారంపూడి: మండల తహశీల్దార్‌గా బివిఆర్ సిహెచ్ ప్రసాద్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మాచవరం తహశీల్దార్‌గా పనిచేసిన ప్రసాద్ కారంపూడికి బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలు దళారులను ఆశ్రయించవద్దని, ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను సంప్రదించాలని ఆయన సూచించారు. తహశీల్దార్ ప్రసాద్‌ను కార్యాలయ సిబ్బంది, విఆర్‌వోలు సత్కరించారు.

తహశీల్దార్‌గా చక్రవర్తి బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సత్తెనపల్లి మండల తహశీల్దార్‌గా కేఎస్ చక్రవర్తి బాధ్యతలు స్వీకరించారు. పిడుగురాళ్ల తహశీల్దార్‌గా పనిచేస్తున్న చక్రవర్తి సత్తెనపల్లి తహశీల్దార్‌గా నియమితులయ్యారు. విధుల్లో చేరేందుకు వచ్చిన నూతన తహశీల్దార్ చక్రవర్తికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు.

హామీని నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-శావల్యాపురం : సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెన్షన్లు పెంచి ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చే ఏర్పాట్లు చేశారని తెలుగు దేశం పార్టీ నాయకులు, వార్డు మెంబర్ వరగాని కిషోర్ అన్నారు. మండలంలోని కారుమంచి గ్రామంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలా కాకుండా వృద్ధులకు వెయ్యి, వికలాంగులకు ఒక్కసారిగా రూ.3 వేలు పెంచి రెండో నెలలో మొదటి రోజే 98 శాతం పంపిణీ చేసి వారి ముఖాల్లో చిరునవ్వు చూస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనే యులుతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని వారి ఆధ్వర్యంలో మేమంతా కలసి కట్టుగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ముందడుగు వేస్తామని అన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠం

విశాలాంధ్ర-శావల్యాపురం : బిడ్డకు తల్లి పాలు శ్రేష్ఠమని, తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని మండల ప్రత్యేక అధికారి మూలే వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని వేల్పూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించి, గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉందని, బిడ్డకు మొదటి టీకా తల్లి పాలే నని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత, అంగన్‌వాడీలు నారా యణమ్మ, రాధ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడేందుకే ఫ్రైడే డ్రైడే

విశాలాంధ్ర-నూజెండ్ల : ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈవోపీఆర్డీ రవికుమార్ అన్నారు. మండలంలోని కంభంపాడు గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న అధ్వానపు పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడంతో పాటు సీజనల్ వ్యాధులను కట్టడిచేసేందుకు సమాంతరంగా తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను పాటించేందుకు ప్రతి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి నలబోలు రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఏఎన్ఎం రాధిక, సచివాలయం సిబ్బంది వెంకట కోటయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేల్పూరు వీఆర్ఏ మృతి

విశాలాంధ్ర-శావల్యాపురం : మండలంలోని వేల్పూరు గ్రామ రెవెన్యూ సహాయకుడిగా పనిచేస్తున్న కాకాని చెన్నయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న తహశీల్ధార్ వేముల వెంకట నాగరాజు ఆదేశాల మేరకు డిప్యూటీ తహశీల్ధార్ పేరిసోముల నాసరయ్య, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ రాంబాబు, సంతోష లక్ష్మీ, తోటి గ్రామ రెవెన్యూ సహాయకులు వారి ఇంటికి వెళ్లి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి, మట్టి ఖర్చులకు రూ.25 వేలు నగదును ఆ కుటుంబానికి అందజేశారు. నాసరయ్య మాట్లాడుతూ మృతి చెందిన చెన్నయ్య తన విధులను సక్రమంగా నిర్వర్తించడం జరిగిందన్నారు.

మానవత్వం చాటుకున్న సచివాలయ ఉద్యోగి



విశాలాంధ్ర-నూజెండ్ల : మండలంలోని జంగాలపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని పెన్షన్ దారులు గుండాల రామకోటమ్మ అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతుంది. పెన్షన్‌కు రాలేనందున పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు సహకారంతో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ ఎన్.నాగేశ్వరరావు గుంటూరు వెళ్లి పెన్షన్ లబ్ధిదారునికి పెన్షన్ అందజేయడంతో పెన్షన్ దారు కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

పత్తి పంటలో పచ్చదోమ నివారణకు చర్యలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పత్తి పంటలో పచ్చదోమ ఉధృతి ఎక్కువగా ఉందని, దీని నివారణకు రైతులు తగిన సస్యరక్షణ పద్ధతులు పాటించాలని మండల చిలకలూరిపేట వ్యవసాయాధికారి టి.శ్రీలత చెప్పారు. శుక్రవారం మండలంలోని కావూరు గ్రామంలో ప్రత్తి పంటను పరిశీలించారు. ప్రత్తి పంట 25-35 రోజుల వ్యవధిలో ఉందని, పంటలో పచ్చదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించారు. దీని నివారణకు మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో లేదా ఇమిడాక్లోరైడ్, నీరు 1:20 నిష్పత్తిలో కలిపి ఆ ద్రావణంతో పంట విత్తిన 20, 40, 60 రోజుల దశలో ప్రతి మొక్క కాండానికి మధ్యలో రెండు అంగుళాల మీద బ్రష్‌తో పూసి రసం పీల్చే పురుగులను అదుపులో పెట్టవచ్చని సూచించారు. దీనిని కాండం మీద బొట్టు పెట్టడం లేదా కాండానికి మందు పూయడం అంటారన్నారు. ఈ విధానం వలన ఖర్చు తగ్గడమే కాకుండా పరిసరాలకు పర్యావరణానికి ఎటువంటి నష్టం జరగదని వెల్లడించారు. రసం పీల్చే పురుగుల నియంత్రణ కోసం అవసరాన్ని బట్టి ఒక ఎకరానికి 100 ఎంఎల్ మోనోక్రోటోఫాస్ లేదా 60 ఎంఎల్ ఇమిడక్లోప్రిడ్ లేదా 40 గ్రాముల ఎసిటామి ప్రైడ్ లేదా థయో మెథాక్సంను మొక్క పూర్తిగా తడిచేలా పిచికారి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జీపీ శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : మాచర్ల మండలం పెద్ద అనుపు చెంచుకాలనీలో అనారోగ్యంతో శీలం పోతమ్మ(85) మృతి చెందడంతో స్థానిక టీడీపీ నాయకులు శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.5 వేలు నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ శీలం పోతమ్మ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూన్సావత్ గోపి నాయక్, పాల్గొన్నారు.

వర్షపు నీరు ఇంకేలా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-నూజెండ్ల : వర్షం పడిన చోట నీళ్లు ఇంకిపోయేలా ప్రతిఒక్కరూ పనిచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.వీరభద్రాచారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జల శక్తి అభియాన్ కార్యక్రమంపై డ్వాక్రా మహిళలకు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ వాన నీటిని ఒడిసి పట్టుకుందాం-భూగర్భ జలాన్ని పెంపొందించుదాం అనే నినాదంతో ప్రతిఒక్కరూ పనిచేయాలని, నీటి సంరక్షణ ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. అడుగంటి పోతున్న భూగర్భ జలాలను అరికట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి సంరక్షణ చర్యలు, మొక్కల పెంపకం మొదలగు వాటిపై గ్రామాల్లో అవగాహన కల్పించి ప్రజల్లో అవగాహన తెప్పించాలని కోరారు. ఏపీవో ఆంజనేయరాజు, ఏపీఎం రామాంజనే యులు, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బ రామయ్య, వెలుగు సీసీలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

విశాలాంధ్ర-యడ్లపాడు : మండలంలోని కోట గ్రామంలో బైక్ చోరీ సంఘటన చోటుచేసికొన్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోట గ్రామానికి చెందిన పఠాన్ రెహమాన్ రోజు మాదిరి బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో తన ఇంటి ముందు బుల్లెట్‌ను ఉంచి హ్యాండిల్ లాక్ చేశాడు. 10.30 వరకు కుటుంబ సభ్యులతో కలిసి మెళకువగానే ఉన్నారు. తెల్లవారుజామున రెహమాన్ తండ్రి ఆదాంఖాన్ చూడగా వరండాలోని బుల్లెట్ కనిపించలేదు. వెంటనే కుటుంబసభ్యులు ఇరుగుపొరుగు వారిని ఆరా తీశారు. బుల్లెట్ అపహరణకు గురైందని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

తహసీల్ధార్‌గా ఫణీంద్ర కుమార్ బాధ్యతలు

విశాలాంధ్ర-దుర్గి : దుర్గి తహశీల్దార్‌గా ఫణీంద్ర కుమార్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు తహశీల్దార్‌గా పనిచేసిన రజని కుమారి బదిలీపైవెళ్ళారు. స్థానిక కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఆయనకు తహశీల్దార్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ అరుణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.